షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ఓట్ల లెక్కింపు కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 2)

సాధారణ ఎన్నికలు 2024 నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు, ఖచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు జిల్లాల వారీగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లు, తదితర అంశాలపై ఆదివారం ఉదయం వెలగపూడి ఏపీ సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్, ఈటిపిబిఎస్, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు, ఓట్ల లెక్కింపునకు అవసరమైన శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, రౌండ్ల వారిగా ఫలితాల ట్యాబులేషన్, ఎన్కోర్ లో ఫీడ్ చేయడం, అందుకు అవసరమైన ఐటీ సిస్టంల ఏర్పాటు, మూడు అంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు తదితర అంశాలపై జిల్లాల వారీగా జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి ఏ ఎస్ దినేష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపునకు 100 శాతం పూర్తిగా సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టామన్నారు. సజావుగా కౌంటింగ్ ప్రక్రియను చేపట్టేందుకు అన్ని విధాలా సంసిద్ధంగా ఉన్నామని, అన్ని రకాల ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ దినేష్ కుమార్, సీ.ఈ.ఓకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.రి




# దామచర్లకు ఓటమి భయం పట్టుకుంది

### అందుకే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు

### అప్పులోళ్లు నీ మీద ఆత్మహత్య కేసు నమోదు చేపిస్తారేమే చూసుకో

### దామచర్లకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి హితవు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 2)

ఓటమి భయం పట్టుకొని దామచర్ల జనార్ధన్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులు రెడ్డి మండిపడ్డారు. ఆడవాళ్ళ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితువు పలికారు. హైదరాబాద్ నుంచి ఒంగోలు వచ్చిన బాలినేని శ్రీనివాసులు రెడ్డి అయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు అయిపోయి నెల అవుంతుంటే ఇప్పుడు గొడవలు గురించి మాట్లాడటం హాస్యస్పదంగా ఉందన్నారు. మా మీద రౌడీ షీట్ ఓపెన్ చేయాలని మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. మహిళ మీద రౌడీ షీట్ ఓపెన్ చేయండి అని మాట్లాడటం చూస్తుంటే దామచర్లకు మతిభ్రమించిందన్నారు. నీ పరిస్థితి చూస్తుంటే జాలి వేస్తుందని ముందు నీవు చేసిన అప్పుల బాధితులకు డబ్బులు కట్టకపోతే వాళ్ళు ఆత్మహత్య చేసుకొని పరిస్థితి వస్తుందేమో అని అన్నారు. అప్పులోళ్లు నీ మీద ఆత్మహత్య కేసు నమోదు చేపిస్తారేమే చూసుకోవాలని హితువు పలికారు.



# కొద్ది పాటి వర్షానికే మురికి కూపంగా కోరుట్ల



(షణ్ముఖ వెలుగు, కోరుట్ల ప్రతినిధి, జూన్ 2)

జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 4వ వార్డు అంబేద్కర్ నగర్‌లో చిన్నపాటి వర్షానికే డ్రైనేజి మురికి నీరు ఇండ్ల లోకి వస్తుంది. గతంలో ఇలా జరగడం వలన మున్సిపల్ అధికారులకు చెప్పినా కనీసం వార్డులో ఎలా ఉందో చూడడానికి కూడా ఎవరు రాలేదని ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. దీంతో వార్డును పట్టించుకోని అధికారులు మాకు ఎందుకు అని వార్డు ప్రజలు ఆందోళనకు దిగారు.



# కుమారుడిని పొట్టనపెట్టుకున్న క్షణికావేశం

### తుపాకీతో కాల్చి చంపిన కానిస్టేబుల్ తండ్రి

### నిందితుడు కొదమల ప్రసాద్‌బాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 2)

నగరంలోని భాగ్యనగర్ 4వ లైన్లో గల ఈవీయం, వీవీప్యాడ్‌ల రిజర్వ్‌డ్ గోదాం వద్ద కొదమల ప్రసాద్ బాబు(52) అనే వ్యక్తి గార్డ్ డ్యూటీ విధులు నిర్వహించటానికి ఈ నెల 1వ తేదీన రాత్రి ఒంగోలు, శ్రీనివాస కాలనీ 1వ లైన్ ఇంటి వద్ద నుంచి తన కుమారుడు కొదమల శేషు కమల్ (20) బైక్ మీద తీసుకుని వచ్చాడు. డ్యూటీ దగ్గర వదిలి పెట్టి వెళ్లే సమయంలో శేషు కమల్ తన తండ్రి 1వ తేదీన జీతం డబ్బులు బ్యాంకు నుండి విత్ డ్రా చేసినందున కుటుంబ అవసరాలు నిమిత్తం డబ్బులు ఇవ్వమని అడుగుగా, ప్రసాద్ బాబు ఇవ్వనని చెప్పాడు. ప్రసాద్ బాబు అప్పుడు శేషు కమల్‌కు డబ్బులు ఎందుకు అవసరమని తన కొడుకుతో వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో ప్రసాద్ బాబు మద్యం సేవించి ఉన్నాడు. ప్రసాద్ బాబు కోపంతో సమీపంలోని గార్డు గదిలోకి వెళ్లి సర్వీస్ రైఫిల్ తీసుకుని రాత్రి 10:05 గంటలకు రోడ్డుపై నిలబడి ఉన్న తన కొడుకును కాల్చి చంపాడు. దాని తరువాత కూడా వెపన్ కాక్ చేసి కాలుస్తానని చూపించాడు. వెంటనే అక్కడ ఉన్న కానిస్టేబుల్‌లు అప్రమత్తం అయ్యి ప్రసాద్ బాబును పట్టుకొని వెపన్‌ను విడిపించి తర్వాత ప్రమాదం జరగకుండా తప్పించారు. గాయపడిన శేషు కమల్‌నును అక్కడ సిబ్బంది చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో చేర్పించగా డాక్టర్ పరీక్ష చేసి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు.

ఈ ఘటనపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ప్రసాద్ బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినారు. మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ శవపంచనామాను పంచాయితీదారుల సమక్షంలో నిర్వహించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఒంగోలులోని జీజీహెచ్ ప్రొఫెసర్‌కు తరలించారు. కొదమల ప్రసాద్‌బాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఘటన జరిగిన ప్రదేశం రిజర్వ్ గోడౌన్ కావడంతో ఆ స్థలంలో పోలింగ్ ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ బాక్సులు లేవు. రైస్ కళాశాలలోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ కౌంటింగ్ కేంద్రం నుంచి సంఘటన జరిగిన ప్రదేశం దాదాపు 9 కిలోమీటర్ల దూరంలో ఉంది.

# కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

## కలెక్టర్‌కి కూటమి నేతల వినతి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 2)

జిల్లాలో ఈ నెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ నీ టిడిపి- బిజెపి - జనసేన కూటమి అభ్యర్థులు కోరారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని ఆదివారం కలసి కూటమి నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ



కౌంటింగ్ సందర్భంగా వైసిపి నేతలు గొడవలకు దిగే అవకాశం ఉందని, వాటిని అదుపు చేయాలని కోరారు. పాస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ను కోరామన్నారు. ఎప్పుడు లేనివిధంగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్లు వేశారని, బ్యాలెట్పై స్టాంప్ లేదని, సంతకాలు లేవని వైసిపి ఏజెంట్లు అభ్యంతరాలు పెట్టే అవకాశం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్, నిర్ణీత సమయంలో లోపు పూర్తి చేయాలన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు ఏజెంట్లను

(తరువాయి 4లో...)

# శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి నారాయణ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 2)

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని టీడీపీ మాజీ మంత్రులు నారాయణ, గంట శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకున్నారు. వీఐపీ దర్శన ప్రారంభ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న నారాయణ, గంటకు టీటీడీ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని నారాయణ ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు.



# కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలి



అనుమతించాలని కలెక్టరు కోరామని, ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలలో స్థలం తక్కువగా ఉండటంతో నిలబడి ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లుగా ఎవరినైనా పెట్టుకోవటానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని, లోకల్, నాన్ లోకల్ సమస్య అంటూ వైసిపి నాయకులు అభ్యంతరాలు చెప్పే అవకాశం ఉందన్నారు. ఏజెంట్లు ఎవరినైనా నియమించుకోవచ్చని, ఎవరైనా అభ్యంతరాలు చెప్పినా, గొడవలు సృష్టించాలని ప్రయత్నించినా బయటకు పంపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఏ ప్రాంతంలో ఇబ్బందులు లేకుండా గొడవులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు దామచర్ల జనార్ధనరావు తెలియజేశారు. కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి విజయకుమార్, దర్శి నియోజకవర్గ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ కడియాల లలిత్ కుమార్, టిడిపి నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి, ఈదర మోహన్, కొఠారి నాగేశ్వరరావు,బండారు మదన్, కూటమి నేతలు పాల్గొన్నారు.అనుమతించాలని కలెక్టరు కోరామని, ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలలో స్థలం తక్కువగా ఉండటంతో నిలబడి ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లుగా ఎవరినైనా పెట్టుకోవటానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని, లోకల్, నాన్ లోకల్ సమస్య అంటూ వైసిపి నాయకులు అభ్యంతరాలు చెప్పే అవకాశం ఉందన్నారు. ఏజెంట్లు ఎవరినైనా నియమించుకోవచ్చని, ఎవరైనా అభ్యంతరాలు చెప్పినా, గొడవలు సృష్టించాలని ప్రయత్నించినా బయటకు పంపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఏ ప్రాంతంలో ఇబ్బందులు లేకుండా గొడవులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు దామచర్ల జనార్ధనరావు తెలియజేశారు. కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి విజయకుమార్, దర్శి నియోజకవర్గ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ కడియాల లలిత్ కుమార్, టిడిపి నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి, ఈదర మోహన్, కొఠారి నాగేశ్వరరావు,బండారు మదన్, కూటమి నేతలు పాల్గొన్నారు.

## భారీ విరాళం ఇచ్చిన మాజీ సింగల్ విండో చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 2)



పట్టణానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ టిడిపి నాయకులు బోయళ్ళ నారాయణరెడ్డి స్థానిక శ్రీ సరస్వతి విద్యాలయం కు తరగతి గదులు కొరతగా ఉందని తెలియగా ఒక తరగతి గదికి తన వంతు సహాయంగా రూ.5,00,116లు గొప్ప మనసుతో ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి జయరాంరెడ్డి, దర్శి మస్తాన్‌రావు, నల్లబోతుల చెన్నయ్య, వరికుటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం

### బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 2)

బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఎన్డీఏ కూటమి తరపున ఒంగోలు అసెంబ్లీకి పోటీ చేయుచున్న దామచర్ల జనార్ధన్ రావు పిలుపు మేరకు ఆయన నివాసంలో బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ కలిసారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు పలు అంశాలపై చర్చించుకున్నారు. ముఖ్యంగా నాల్గో తేదీన జరుగు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ గురించి ఎక్సిట్ పోల్స్ గురించి చర్చించారు. దేశ వ్యాప్తంగా అన్ని ఎక్సిట్ పోల్స్ సంస్థలు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని చెప్పటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా యోగయ్య యాదవ్ బయట విలేకరులతో మాట్లాడుతూ ముందు నుంచి అనుకున్నట్లే కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి 400 ఎంపీ సీట్లు తో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీఏ కుటమి 150 మంది ఎమ్మెల్యేలతో అఖండ విజయం దిశగా కేంద్రములో, రాష్ట్రములో ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాభవాన్ని చవిచూడ పోతుందని, రాష్ట్రంలో వైసీపీ 25మంది ఎమ్మెల్యే లతో ఘోరంగా దెబ్బతినబోతున్నదని తెలుపుతూ ఈ దేశంలో వచ్చే 5ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ ఉనికిని కోల్పోయి మోడీ చెప్పినట్లు కాంగ్రెస్ ముక్త భారత్ కల సాకారమౌతున్ననదని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు మోడీవైపే ఉన్నట్లు గా చాలా స్పష్టంగా తెలుస్తుందన్నారు. వచ్చే 5ఏళ్లలో మోడీ నాయకత్వంలో దేశము అన్ని రంగాలలో అభివృద్ధి చెంది ప్రపంచానికి నాయకత్వం వహించే రోజులు ఎంతో దూరంలో లేవని తెలిపారు.



# అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలి

### జిల్లా కలెక్టర్ గౌతమ్



(షణ్ముఖ వెలుగు, మేడ్చల్ ప్రతినిధి, జూన్ 2)

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పిలుపు నిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కీసరలోని అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ పతాకావిష్కరణ చేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయ్యాయని 11వ సంవత్సరంలోకి అడిగిడుతున్న వేళ జిల్లా ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎంతోమంది త్యాగధనుల కృషి ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు అందరూ ముందుకు రావాలని అన్నారు. తెలంగాణ ప్రజలు కలలుగని సిద్ధించుకున్న దాన్ని పురోగమన దిశగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని సామాజిక వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ పట్టణ నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ సమగ్రాభివృద్ధికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ జిల్లా అభివృద్ధికి పునరంకితులై అన్ని రంగాల్లో ముందుకు నడిపేందుకు తమ వంతు సహకారాన్ని అందించాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా శాంతియుతంగా నిర్వహించుకోవడానికి ఓటింగ్ శాతాన్ని పెంచడానికి కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి



ఎన్నికల సిబ్బందికి పోలీసు అధికారులకు జిల్లా ప్రజా ప్రతినిధులకు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి నిఖిత పంత్, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, విజేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు, పోలీస్ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## వ్యాపార వేత్త గుండు శ్రీశైలంను సన్మానించిన పురోహితులు వంగపల్లి అంజయ్య స్వామి



(షణ్ముఖ వెలుగు, ఆలేరు ప్రతినిధి, జూన్ 2)
హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పురోహితుడు వంగపల్లి అంజయ్య స్వామి చేతుల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త గుండు శ్రీశైలం ఘన సన్మానాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా ఉమామహేశ్వర దేవస్థానం లడ్డు ప్రసాదాన్ని అందజేసి శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. గుండు శ్రీశైలం సత్కారం అందుకున్న సందర్భంగా పట్టణ పుర ప్రముఖులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు హెచ్ఎం టీవీ రిపోర్టర్ గుండు మహేందర్, సత్య రిపోర్టర్ గుండు మధుసూదన్, వార్త రిపోర్టర్ కూల్ల సిద్దులు, తదితరులు పాల్గొన్నారు.

## 1998-1999 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




(షణ్ముఖ వెలుగు, కోరుట్ల టౌన్ ప్రతినిధి, జూన్ 2)
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని టీచర్స్ క్లబ్ రోడ్ లో గల శివ నందిని ప్రాథమికోన్నత పాఠశాల 1998-1999 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సరళ, రాజమణి, మాధవి లత, శ్రీనివాస్, రాములు ,సత్యనారాయణ, కిషన్, కిషోర్, హరికృష్ణ, మోహిన్ మతిన్ , విద్యార్థిని, విద్యార్థులు వనతడుపుల సతీష్, సిద్ధార్థ ,బాలే మహేష్ కుమార్ ,పిట్ట మురళి, ఆరెళ్ళ శ్రీనివాస్ ,గుండోజి మధు, గిల్లె గంగాధర్ , స్వప్న ,సౌజన్య, నిర్మల, హేమలత ,తదితరులు పాల్గొన్నారు. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

## జాతీయ జెండా ఆవిష్కరించిన కాంగ్రెస్‌పార్టీ వేల్దేవి అధ్యక్షులు మంటిపల్లి గంగయ్య



(షణ్ముఖ వెలుగు, అడ్డగూడూరు ప్రతినిధి, జూన్ 2)
అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ చేసిన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మంటి పల్లి గంగయ్య. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ బోడ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ కోడమర్తి జలంధర్, గజ్జి రామచంద్రు, బోడ శీను, జూలూరి వెంకట్, మల్లు, గోలి నర్సయ్య, బోడ సత్తయ్య, కోటమర్తి చిన్న మల్లయ్య, లక్ష్మయ్య, నిమ్మల రాకేష్, మిట్టగడుపుల మహేష్, మిట్టగడపల సైదులు, మంటి పల్లి మహేందర్, నిర్మల శివకుమారు, రొడ్డ బిక్షం, ఉడుగు పరశు రాములు, రొడ్డ వెంకన్న, షేక్ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్‌ను సరళతరం చేయడం చారిత్రక అవసరం






(షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జూన్ 2)
సాధారణ ఎన్నికల సమయంలో అత్యవసర విభాగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు సైనికులు దేశం వెలుపల పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు నిర్బంధంలో నివసిస్తున్న వ్యక్తులు వికలాంగులు, 85 ఏళ్ళు పైబడిన ఓటర్లు రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కును వినియోగించుకునేందుకు భారత ఎన్నికల సంఘం 'ఎన్నికల నియమావళి 1961' లోని రూల్ 23ను సవరించి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల్లో ఓటు వేసేందుకు సర్వీస్ ఓటర్లకు వీలు కల్పించింది. సాధారణ ప్రజల లాగానే విధుల్లో ఉన్న సర్వీస్ ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థిని మరియు ప్రభుత్వాన్ని ఎన్నుకునే వీలు కల్పించిన భారత రాజ్యాంగం, ఎన్నికల సంఘం సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్ కు అత్యంత ప్రాధాన్యత కల్పించింది. చాలాసార్లు సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్ ప్రభావం అభ్యర్థుల గెలుపోటములు పై విశేషమైన ప్రభావాన్ని చూపిన సంఘటనలు దేశంలో ఎన్నో ఉన్నాయి. ఉద్యోగం కారణంగా తమ నియోజకవర్గాల్లో ఓటు వేయలేని వ్యక్తులు దీన్ని ఎన్నికల్లో ఉపయోగించడం పరిపాటి. ప్రతిసారి ఎన్నికల సంఘం నియోజకవర్గంలో పోస్టల్ ఓటర్ల సంఖ్యను నిర్ణయించి వారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్ పంపే 'ఎలక్ట్రానిక్ ట్రాన్స్మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం'( ఈటీపిబిఎస్ ) ను ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఎప్పటికప్పుడు నవీకరించడం అత్యంత అవశ్యమే.

అయితే ఎలక్షన్ ఇయర్ 2024లో చాలా ఎన్నికలు జరగబోతున్న ఈ తరుణంలో ఈ పోస్టల్ బ్యాలెట్‌లో సర్వీస్ ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందుల్ని అధిగమించేందుకు పోస్టల్ బ్యాలెట్ వ్యవస్థను, పోస్టల్ బ్యాలెట్ కోసం ఉపయోగించే ఫామ్స్ ను అత్యవసరంగా సరళతరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోస్టల్ బ్యాలెట్ కోసం ఉపయోగించే ఫామ్ 12 డి ఫామ్, 13ఏ ఫామ్, 13బి ఫామ్, 13సీ ఫామ్, ఫామ్ 13డీ లాంటి విభిన్నమైన ఫారాలు పెట్టడం వల్ల సర్వీస్ ఓటర్లు విపరీతమైన సందేహాలకు ,సందిగ్ధాలకు లోనై అనేక తప్పులు చేయడం వల్ల వేలాది ఓట్లు నిరుపయోగమవుతున్నాయి. ఎన్నికల మూల సిద్ధాంత అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఎదురవుతుంది. స్వతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా ఇంకా బ్రిటిష్ కాలం నాటి కాలం చెల్లిన పోస్టల్ బ్యాలెట్ వ్యవస్థను ఉపయోగించడం ఆచరణకు విరుద్ధంగా ఉందని మెజారిటీ సర్వీస్ ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికలలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ పోస్టల్ బ్యాలెట్‌ను సరళతరం చేసి సింగిల్ ఫామ్ సింగిల్ ఎనవలప్ సిస్టంను సర్వీస్ ఓటర్లు కోరుతుండడం తక్షణ పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల సంస్కరణలు తీసుకురావడానికి సమయం ఆసన్నమైందనే చెప్పవచ్చు. కావున ఈ దిశగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పోస్టల్ బ్యాలెట్ వ్యవస్థలో సరళతరమైన, విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చే దిశగా అడుగులు వేయాలి.

# కౌంటింగ్ విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించండి

### ఆర్ఓ వికాస్ మర్మత్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 2)
సార్వత్రిక ఎన్నికల చివరి దశ కౌంటింగ్ ప్రక్రియలో అన్ని విభాగాల అధికారులు, సహాయక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని 117 - నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, ఐ.ఏ.యస్., సూచించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి అవగాహనా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.ఓ మాట్లాడుతూ ఈనెల 4 వతేదీ మంగళవారం నాడు కౌంటింగ్ కేంద్రానికి ఉదయం 4.30 గంటలకు విధులు కేటాయించిన సిబ్బంది అందరూ హాజరు కావాలని సూచించారు. కేంద్రంలో అబ్జర్వర్ సమక్షంలో ఉదయం 5 గంటలకు కౌంటింగ్ స్టాఫ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ జరుపుతామని, అనంతరం వారికి సంబంధిత విధులను కేటాయిస్తామని తెలిపారు. లోక్ సభ, అసెంబ్లీ కౌంటింగ్ విభాగాలకు విడివిడిగా సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. సిబ్బంది హాజరు ప్రక్రియ, తాత్కాలిక రిజర్వ్ స్టాఫ్ నియామకం, కేంద్రంలో క్రమశిక్షణ అమలు, నిబంధనల పాటింపు వంటి అంశాలపై ప్రత్యేక బృందాలను నియమించామని వివరించారు. ఆర్.ఓ టేబుల్ నిర్వహణ, కౌంటింగ్ ప్రక్రియ పర్యవేక్షణ, రౌండ్ల వారీగా కౌంటింగ్ వివరాల వెల్లడి, డిస్ప్లే సైన్ బోర్డులపై ఓట్ల వివరాల ప్రదర్శన, స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు భద్రంగా ఈవీఎంల తరలింపు ప్రక్రియ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈవీఎంల సీలింగ్, వివి ప్యాట్ల పేపర్ స్లిప్స్ కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో ఇంటర్నెట్, పవర్ కేబుల్స్, సిసి కెమెరాల ఏర్పాటు, వీడియో కెమెరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్.ఓ సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, అత్యవసర జెనెరేటర్‌ను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మొబైల్ కలెక్షన్ పాయింట్, మెడికల్ హెల్ప్ డెస్క్, పార్కింగ్ ప్రాంతం, పారిశుద్ధ్య నిర్వహణలపై సిబ్బందికి విధివిధానాలను ఆర్.ఓ సూచించారు. ఈ సమావేశంలో ఏ.ఆర్.ఓ. లు శర్మద, వెంకటేశ్వరరావు, ప్రసాదరావు, వెంకట రమణ, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, ఎస్.ఈ సంపత్ కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.





# నిఘా నేత్రాలు సిద్ధం

### నేరాలకు పాలడితే చర్యలు
### సింగరాయకొండ ఎస్ఐ శ్రీ రాం హెచ్చరిక

(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జూన్ 2)



సాధారణ ఎన్నికల లెక్కింపుతో పాటు సింగరాయకొండ కేంద్రంలో చోటు చేసుకుంటున్న కొత్తతరహా నేరాలు, నేరస్తుల ఆట కట్టించేందుకు పోలీస్ నిఘా నేత్రాలను గుర్తించిన ప్రదేశాలలో ఏర్పాటుకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధుల తో ముచ్చటిస్తూ ఇటీవల కాలంలో చోటు చేసుకున్న నేరాలు, సాధారణ ఎన్నికల ఫలితాల అనంతరం ఎటువంటి సంఘటనలకు తావు లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా కొన్ని ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల లో నిఘా లేత్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ఐ తుళ్లూరు శ్రీ రాం తెలిపారు. నేరాల నివారణ నేరస్తుల కదలికలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని వెను వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేందుకు ఈ నిఘా నేత్రాలు ఉపయోగ పడతాయని ఆయన అన్నారు. ఈ నిఘా నేత్రాలు సింగరాయకొండ పోలీస్ వారి పర్యవేక్షణలో ఉంటాయని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు, నేరాలకు పాల్పడిన తప్పించుకు పోలేరని నిరంతరం పోలీస్ పరిశీలన లో ఉంటాయని ఆయన వివరించారు. ప్రధానంగా సాధారణ ఎన్నికల ఫలితాల సందర్భంగా తర్వాత ఏటువంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చేపట్టే చర్యలలో ఈ నిఘా నేత్రాలు కీలకం అన్నారు. సింగరాయకొండ లో పూర్తి గా 144 సెక్షన్ అమలు లో ఉంటుందని ఎవరు కూడ దీన్ని అతిక్రమిస్తే నిఘా నేత్రం సహాయంతో పోలీస్ చర్యలకు గురికావల్సి వస్తోందని ఎస్ఐ శ్రీరాం హెచ్చరించారు.



## కందుల స్వగృహానికి చేరిన టీడీపీ నాయకులు

### ఒక్క చోటకు చేరిన జిల్లా అభివృద్ధి ప్రధాతలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం పట్టణం, జూన్ 2)
మార్కాపురం పట్టణంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం నేతలు సమావేశమయ్యారు. ఉమ్మడి తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా నాయకులు, మార్కాపురం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ఆహ్వానం మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం నేతలు జవహర్‌నగర్‌లోని కందుల నారాయణరెడ్డి స్వగృహానికి విచ్చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయాలు, జిల్లా అభివృద్ధి పై భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కనిగిరి కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుమల అశోక్‌రెడ్డి, ఎర్రగొండపాలెం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు, దర్శి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మి లలిత్ సాగర్, ఒంగోలు తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, మార్కాపురం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

(షణ్ముఖ వెలుగు, అడ్డగూడూరు ప్రతినిధి, జూన్ 2)
యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బిజెపి పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను అడ్డ గూడూరు బీజేపీ మండల అధ్యక్షులు ననుబోతు సైదులు యాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కూరాకుల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షులు ఇమ్మానియేల్ ,ఉపాధ్యక్షులు ఏనుగు బీరుమల్లు, కుమారస్వామి, నవీన్ చారి, గూడా అవిలయ్య, దేశ బోయిన నాగరాజు, ఏనుగు బాలు, కూరాకుల యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.



# ఓట్ల లెక్కింపు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలి

## కలెక్టర్ దినేష్ కుమార్





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 2)

ఈ నెల 4వ తేదీ జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, సజావుగా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ ఎస్ దినేష్ కుమార్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ లోని స్పందన హాల్లో కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్, జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు అరవింద్ కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహతా, గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, సంతనూతలపాడు అసెంబ్లీ సెగ్మెంట్స్ అబ్జర్వర్స్ ఐటినోలిన్ మావ్లాంగ్, బీరేంద్ర కోర్కోర, అనిమేష్ డెబ్బర్మ, డాక్టర్ బాపు గోపినాద్, పవార్‌లతో కలసి ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పై రిటర్నింగ్ అధికారులతో సమావేశమై కౌంటింగ్ రోజున తీసుకోవలసిన ఏర్పాట్లు, చర్యల పై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు అరవింద్ కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహతా సంయుక్తంగా మాట్లాడుతూ ఈ నెల 4న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ కౌంటింగ్ విధులకు కేటాయించబడిన సిబ్బంది 4వ తేదీ ఉదయం 5 గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకునేలా ఆర్ ఓ లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని కౌంటింగ్ హాలులోకి సెల్ ఫోన్లు అనుమతించవద్దన్నారు. కౌంటింగ్ సిబ్బంది, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు చేయవలసిన విధులకు సంబంధించి ముఖ్యమైన అంశాలపై చెక్ లిస్ట్ లను రూపొందించి వారికి అందించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి టెన్షన్ వాతావరణం లేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా కౌంటింగ్ సాగేలా రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని, కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబంధిత రిటర్నింగ్ అధికారుల ఆదేశాలు, సూచనల మేరకు బందోబస్తు సిబ్బంది విధులు నిర్వర్తించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీన, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రెండోవిడత రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించిన కలెక్టర్ ఎం హరినారాయణన్






(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 2)

2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఆన్ లైన్ పద్ధతిలో సిబ్బందిని కేటాయిస్తూ రెండో విడత కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కౌంటింగ్ అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఆన్‌లైన్‌లో కౌంటింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించి రెండోవిడత రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో పూర్తి చేశారు. కార్యక్రమంలో కౌంటింగ్ అబ్జర్వర్లు నితిన్ సింగ్ బదారియా, జయేంద్ర కుమార్ విజయవత్, అభిలాష్ కుమార్ టీజీ, రిటర్నింగ్ అధికారులు చిన్న ఓబులేసు, మలోల, శీనా నాయక్, ప్రేమ్ కుమార్, డీఆర్ఓ లవన్న, ఎన్ఐసి జిల్లా సమాచార అధికారి సురేష్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అవి ఎగ్జిట్ పోల్స్ కావు మోడీ మీడియా పోల్స్

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 2)

దేశ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నిన్న వివిధ మీడియా ఛానల్స్‌లో వివిధ ఎన్నికల సర్వే సంస్థలు కేంద్రంలో మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్‌కి ప్రజల విశ్వాసనీయత లేదని అవి కేవలం" మోడీ మీడియా పోల్స్" మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా నేడు పొదిలిలో విలేకరులతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ అన్నారు. గత పదేళ్ల మోడీ పాలలో దేశం తిరో గమన దిశలో పయనిస్తుందని, అలాంటి నేత నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి ఏ విధంగా ప్రజలు పట్టం కడతారని సైదా ప్రశ్నించారు. మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో 400 పై చిలుకు బిజెపికే వస్తాయని జబ్బలు చరిచి మాట్లాడిన బిజెపి నాయకులకు ప్రజా పోల్స్‌తో దిమ్మ తిరిగిపోవడం తథ్యమని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని ఇండియా కూటమి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రజల అభిమానాన్ని పొంది ఎవరు ఊహించని రీతిలో ఈ నెల 4 తేదీ జరగనున్న ఓట్ల లెక్కింపులో ఇండియా కూటమి విజయం సాధించ బోతుందని షేక్ సైదా ఆశాభం వ్యక్తం చేశారు.



దక్షిణ భారతదేశంలోని తమిళనాడు కేరళలో స్థానిక ప్రాంతీయ పార్టీల కలిసి ఒకటి రెండు స్థానాల్లో ఖాతా తెరవోడుతూనేమో కానీ ఉత్తర భారత దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి నిరాశ తప్పదని సైదా అన్నారు. ఆంధ్రప్రదేశ్లో కూడా కాంగ్రెస్ పార్టీ గణనీయమైన సంఖ్యలో ఓట్లు సాధించబోతుందని, పార్లమెంట్లో అలాగే శాసనసభలో కాంగ్రెస్ పార్టీ నుంచి పదేళ్ల తర్వాత మొదటిసారిగా అడుగుపెట్టనున్నారని సైదా ఆశాభావం వ్యక్తం చేశారు.

# కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు



(షణ్ముఖ వెలుగు, మహాదేవపూర్ ప్రతినిధి, జూన్ 2)

మహాదేవ పూర్ మండల కేంద్ర పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జూన్ 2న కస్తూర్బా ఆశ్రమ పాఠశాల ఇన్చార్జి ఉపాధ్యాయురాలు దాసరి రమ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. తెలంగాణ సాధించిన ఉత్సవాలు జరుపుకుంటున్నాం అంటే ఎందరో మేధావులు కలలు కన్న స్వరాష్ట్రం కలలను నెరవేర్చుకున్నాం అంటే ఎంతో మంది త్యాగమూర్తుల బలిదానాలు, విద్యార్థి ఉద్యోగులు నాయకులు ప్రజలతో మమేకమై సకల జనుల సమ్మె చేసి సాధించుకున్న స్వరాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో తెలంగాణ రాష్ట్ర కవి అందె శ్రీ రచించిన జయ జయహే తెలంగాణ రాష్ట్రీయ గీతాన్ని సగర్వంగా ఆలపించడం జరిగింది. రాష్ట్ర పాలన మన చేతుల్లోనే ఉన్నది కావున ఏదైతే నీళ్ళు నిధులు నియామకాలు కోసం పోరాటం చేసి సాధించుకున్నాం కలలు కన్న తెలంగాణ అన్ని రంగాలలో ముందంజలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# బస్సులో పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 2)

కనిగిరి డిపోకు సంబంధించిన ఎపి 39 జెడ్ 0482 అల్ట్రా డిలేక్స్ బస్సులో గుంటూరు నుంచి మేదరమెట్లకి బస్సులో ప్రయాణించిన కె.విరాంజ్ గౌడ్ అను ప్రయాణికుడు మేదరమెట్లలో దిగి వెళ్లిపోయారు. బస్సు కనిగిరి వచ్చి గ్యారేజ్ వెళుతున్నపుడు సెక్యూరిటీ పాయింట్‌లో విధి నిర్వహణలో ఉన్న ఆర్.సి.ఎస్ కె.ఎ బేగం,హెడ్ కానిస్టేబుల్ ఎస్.కొండయ్య బస్సును తనిఖీ చేయుచుండగా ప్రయాణికుల సీట్ల మధ్యలో పాడియున్న సెల్ ఫోన్ ను గమనించి ఆ సెల్‌ను తసుకొనుచుండగా ఆ సెల్‌కు ఫోన్ రావడంతో హెడ్ కానిస్టేబుల్ కొండయ్య ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడగా ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఆ ఫోన్ నాది అని చెప్పగా ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకొని సెక్యూరిటీ పాయింట్లో సెల్ ఫోనును భద్రపరచగా కనిగిరి లో ఉన్న వారి అన్న కెవిఎస్ గౌడ్ డిపో వద్దకు వచ్చి బస్సు వివరాలు టిక్కెట్ వివరాలు తెలియపరచగా హెడ్ కానిస్టేబుల్ ఎస్ కొండయ్య సెల్ ఫోన్‌ను అప్పగించడం జరిగింది. విలువైన వస్తువులు తిరిగి అప్పగించినందుకు కెవిఎస్ గౌడ్ డిపో మేనేజర్‌కు, హెడ్ కానిస్టేబుల్‌కు, ఆర్టీసీ సిబ్బందికి ధన్యవాదములు తెలిపారు.

# దర్గాలో పూజలు చేసిన ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ నేతలు







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 2)

తెలుగుదేశం పార్టీ కూటమి అఖండ విజయం సాధించాలని కోరుతూ మార్కాపురం నియోజకవర్గం తర్లుపాడు మండలం తుమ్మలచెరువులోని దర్గాలో ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్, మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి , అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు, టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో టీడీపీ కూటమి విజయం సాధించి చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రార్థించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# బీట్‌రూట్‌లో వీటిని వేసి ప్యాక్ వేస్తే తెల్లజుట్టు తగ్గి పొడుగ్గా పెరుగుతుంది..



జుట్టు పెరగడానికి చాలా మంది ఎన్నో ప్రయోగాలు చేస్తుంటారు. అయితే, బయట దొరికేవి మాత్రమే కాకుండా కిచెన్‌లోనే దొరికే కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. జుట్టు రాలడం, జుట్టు చిట్లడం, పొడి జుట్టు, చుండ్రు వంటి అనేక రకాల జుట్టు సమస్యలు ఉన్నాయి. మంచి ఆహారం తీసుకుంటే జుట్టుని కాపాడుకోవచ్చు. చాలా మంది ఎదుర్కొనే సమస్యల్లో జుట్టు తెల్లబడడం. ఇందుకోసం ఇంట్లోనే తయారుచేసే హెయిర్ మాస్క్ జుట్టు అందాన్ని కాపాడుకోవచ్చు.

**బీట్‌రూట్..**బ్యూటీ కేర్‌లో బీట్‌రూట్ ముందుంటుంది. బీట్‌రూట్ హెయిర్‌ఫోలికల్స్‌కి పోషణని అందిస్తుంది. ఆరోగ్యకరమైన జుట్టు పెరుగదలకి బీట్‌రూట్ హెల్ప్ చేస్తుంది. బీట్‌రూట్‌లో జుట్టు కుదుళ్ళకి అవసరమైన విటమిన్స్, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. బీట్‌రూట్ జుట్టు రాలడాన్ని తగ్గించొచ్చు. చుండ్రుని తగ్గించడంలో కూడా కూడా హెల్ప్ చేస్తుంది. బీట్‌రూట్‌ని వాడడం వల్ల తెల్ల జుట్టు తగ్గుతుంది. బీట్‌రూట్‌లో విటమిన్ సి, ఇ, కెరోటిన్స్ ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇవి జుట్టుని నల్లగా మార్చడానికి అవసరం.



**హెయిర్ డ్యామేజీని తగ్గించే సీరమ్..**

**మెంతులు..**జుట్టు రాలడాన్ని తగ్గించడంలో మెంతులు ముందుంటాయి. ఇందులోని అమినో యాసిడ్స్ జుట్టూ పెరుగుదలకి హెల్ప్ చేస్తాయి. జుట్టుని పాడు చేసే కెమికల్స్ ఈ మెంతులు దూరం చేస్తాయి. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా సహజమైన రీతిలో జుట్టు పెరుగుదలకి మెంతులు హెల్ప్ చేస్తాయి. ఇందులో జుట్టుని బలంగా చేయడానికి సహాయపడే లెసిథిన్ ఉంటుంది. మెంతులు జుట్టుని మాయిశ్చరైజ్‌గా ఉంచుతుంది.

**అలోవెరా..**జుట్టు రాలడాన్ని తగ్గించడానికి అలోవెరా బాగా పనిచేస్తుంది. అలోవెరాలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. తలలో పిహెచ్ స్థాయిని బ్యాలెన్స్ చేయడంలో కలబంద ముందుంటుంది.

# మెహందీ పెట్టుకున్న తర్వాత దురద పెడుతుందా.. ఇలా చేయండి..



ఇదివరకటి రోజుల్లో గోరింటాకు పెట్టుకునేవారు. అది చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ, రాన్రానూ గోరింటాకు దొరక్కపోవడం, కావాల్సిన డిజైన్ పెట్టుకోవడానికి మెహందీని పెట్టుకుంటున్నారు. అయితే, వీటిని పెట్టుకున్నప్పుడు కొంతమందికి కాళ్ళు, చేతులకి పెట్టుకున్నప్పుడు అలర్జీ వస్తుంది. దీని కారణంగా కాళ్ళు చేతులు ఎరుపు, దురద, మంటలు ఉంటాయి. అలంటప్పుడు, ఆ సమస్యల్ని దూరం చేసుకునేందుకు ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలో తెలుసుకోండి.

**అలోవెరా జెల్..**ప్రజెంట్ మార్కెట్లో చాలా మెహందీలు లభిస్తున్నాయి. వీటిలో ఎక్కువగా కెమికల్స్ ఉంటున్నాయి. వీటిని వాడడం వల్ల సమస్యలొస్తాయి. మెహందీ అప్లై చేసిన తర్వాత మీకు అలర్జీ అనిపించినప్పుడు చేతులకి ఐస్‌ని అప్లై చేయొచ్చు. దీంతో పాటు అలోవెరా జెల్ కూడా రాయొచ్చు. దీని వల్ల చర్మం చల్లబడుతుంది. అలోవెరా జెల్





రాసి 15 నుంచి 20 నిమిషాల పాటు అలానే ఉంచి చల్లని నీటితో కడిగితే రిలీఫ్ ఉంటుంది.

**నిమ్మరసం..**నిమ్మరసం వాడడం వల్ల కూడా అలర్జీని తగ్గించుకోవచ్చు. దీనికోసం నిమ్మరసంని తీసుకుని గుడ్డలో వేయండి. దీనిని అలర్జీ ఉన్న ప్రదేశంలో రాసి 10 నిమిషాలు ఉంచండి. దీని వల్ల మెహందీ వల్ల వచ్చే అలర్జీ తగ్గిపోతుంది.

**కొబ్బరినూనె..**మెహందీ వల్ల ఏదైనా అలర్జీ వస్తే కొబ్బరి నూనె వాడొచ్చు. దీని వల్ల దురద తగ్గుతుంది. బర్నింగ్ సెన్సేషన్ నుండి ఉపశమనం ఉంటుంది. రాత్రి పడుకునే ముందు చేతులకి కొబ్బరి నూనె రాయొచ్చు.

**మెహందీ పెట్టుకునే ముందు..**నార్మల్‌గా మెహందీని పెట్టుకునే ముందు కొన్ని విషయాలను గుర్తుపెట్టుకోవాలి. మెహందీని పెట్టుకునే ముందు ప్యాచ్ టెస్ట్ చేసుకోవాలి. ఓ చోట మెహందీ రాసి కాసేపు ఉండాలి. మీకు ఏదైనా చిరాకు అనిపిస్తే ఆ మెహందీ వాడొద్దు. మెహందీని అప్లై చేశాక మంట, దురదగా ఉంటే వెంటనే క్లీన్ చేసుకండి. కాసేపటికి కూడా ప్రాబ్లమ్ తగ్గకపోతే డాక్టర్‌ని కలవడం మంచిది.

# కొత్తిమీర ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే ఇలా చేయండి..

కొత్తిమీర కూరల్లో వేస్తే చాలా రుచిగా ఉంటుంది. కానీ, దీనిని ఎక్కువగా తీసుకొచ్చి పెట్టుకుంటే త్వరగా వాడిపోతుంది. అలాకాకుండా ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. వీటి వల్ల కొత్తిమీర కనీసం 15 రోజులపైనే తాజాగా ఉంటుంది. అందుకోసం ఏంచేయాలంటే..



**వంటల్లో..**వంటకి మంచి రుచి రావాలంటే అందులో వేసే పదార్థాలని బట్టి ఉంటుంది. అవి తాజాగా ఉంటే కూరలు కూడా టేస్టీగా ఉంటాయి. అలాంటి వాటిలో కొత్తిమీర ఒకటి. కొత్తిమీరని మనం వంటల్లో వాడితే వాటి రుచి అమాంతం పెరుగుతుంది.

**వేర్లని ఉంచడం..**కొత్తిమీర కొనేటప్పుడు వేర్లతో సహా కొంటే వాటిని ఇంటికి తీసుకురాగానే కట్ చేయొద్దు. ముందుగా కొత్తిమీరని చక్కగా కడగాలి. తర్వాత ఆకులని క్లీన్ చేయాలి. తర్వాత దానిని పూర్తిగా ఆరనివ్వండి. దానికోసం ఓ గిన్నె, కాగితంలో వేసి ఆరనివ్వండి.

**ఓ కంటెయినర్..**తర్వాత గాలి చొరబడని గాజు కంటెయినర్ తీసుకోండి. దీనిని చక్కగా నీరు లేకుండా తుడిచి ఆరబెట్టండి. నీరు ఉంటే కొత్తిమీర కుళ్ళిపోతుందని గుర్తుపెట్టుకోండి. తర్వాత ఇప్పుడు ఆ కంటెయినర్‌లో మిగతా భాగాల్లో నీరు పడకుండా అడుగున మాత్రమే పోయేలా నీటిని పైనుంచి పోయండి. ఎందుకంటే పైనున్న ఆకులపై నీరుపడితే త్వరగా కుళ్ళిపోతుంది. ఇప్పుడు వేర్లు మాత్రమే మునిగేలా మాత్రమే కొత్తిమీరని ఆ కంటెయినర్‌లో పెట్టండి. కొత్తిమీర ఆకులు జాడీలో పెట్టేసి మూతపెట్టండి.



**ఫ్రిజ్‌లో..**ఈ కంటెయినర్‌ని ఫ్రిజ్‌లో పెట్టండి. దీనిని కరెక్ట్‌గా చేస్తే నెల రోజుల పాటు కొత్తిమీర తాజాగా ఉంటుంది.

**మరోపద్ధతి..**మరో విధంగా కూడా కొత్తిమీరని ఎక్కువరోజులు స్టోర్ చేసుకోవచ్చు. కొత్తిమీరని ముందుగా బాగా కడిగి ఆరబెట్టండి. నీరు లేకుండా చూడండి.

తర్వాత దానిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేయండి. ఇలా కట్ చేసిన కొత్తిమీరని ఓ కంటెయినర్‌లో టిష్యూ పేపర్ వేసి అందులో పెట్టండి.

దీనిని ఫ్రిజ్‌లో పెట్టండి. దీని వల్ల కొత్తి కొత్తిమీర రెండు వారాల పాటు తాజాగా ఉంటుంది. పైన మరో టిష్యూ పేపర్ వేసి కంటెయినర్‌ని మూసేయండి.

దీని వల్ల కొత్తిమీర తేమ లేకుండా తాజాగా చాలా రోజుల వరకూ ఉంటుంది.

# జామపండ్లని ఇలా తీసుకుంటే షుగర్ కంట్రోల్ అవుతుందట..

షుగర్ ఒక్కసారి వచ్చిందంటే దానిని కంట్రోల్ చేయకపోతే బాడీలోని పార్ట్స్ ఎఫెక్ట్ అయి మరణానికి కారణమవుతుంది. ఇది వంశపారంపర్య వ్యాధి అని కూడా చెప్పొచ్చు. కాబట్టి, దీనిని కంట్రోల్ చేసుకోవడం చాలా ముఖ్యం.

**షుగర్..**డయాబెటిస్ ఉంటే దానిని కంట్రోల్ చేసుకోవడం చాలా ముఖ్యం. దీనిని కంట్రోల్ చేసేందుకు కొన్ని ఇంటి చిట్కాలున్నాయి. ఇవన్నీ కూడా ఎంతో హెల్ప్ చేస్తాయి. శరీరానికి ఎలాంటి హాని కలిగించవు. అందులో జామకాయలు తినడం కూడా ఒకటి. దీనిని సరిగ్గా తింటే కచ్చితంగా షుగర్ కంట్రోల్ అవుతుందట.









జామపండ్లు తింటే కలిగే లాభాలు..

**జామలోని పోషకాలు..**జామలో చాలా పోషకాలున్నాయి. ఇందులో ఆరెంజెస్ కంటే ఎక్కువగా విటమిన్ సి ఉంటుంది. ఇందులో విటమిన్ బి2, ఇ, కె, ఫైబర్, మాంగనీస్, పొటాషియం, ఐరన్, ఫాస్పరస్ పుష్కలంగా ఉన్నాయి. జామపండు అనేక వ్యాధుల నుండి కాపాడుతుంది. జామ, జామ ఆకు, కాండంలో కూడా అనేక పోషకాలున్నాయి.

**ఎలా తీసుకోవాలి..**జామ కాయలు దోరగా ఉన్నవి తీసుకోండి. వాటిని మెత్తగా మిక్సీ పట్టండి. అందులో 250 మి.లీ నీరు, ఓ గ్లాస్ జ్యూస్‌కి నీరు కలిపి ఉంచండి. దీనిని మరుసటి రోజు పరగడపున తీసుకుండి. ఇలా జామపండ్లని తీసుకుంటే షుగర్ కంట్రోల్ అవుతుంది.

**కారణం..**జామలో డైటరీ ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర శోషణని నెమ్మదిస్తుంది. ఇది చెక్కర పెరగకుండా చేస్తుంది. అదే విధంగా, జామపండులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అంటే షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. షుగర్ లెవల్స్‌ని తక్కువ స్థాయిలో మాత్రమే పెంచుతుంది. మధుమేహాన్ని కంట్రోల్ చేయడానికి చాలా మంచిది.

# సీక్వెల్‌లో త్రిష?




'అమ్మోరు తల్లి'గా అగ్ర కథానాయిక నయనతార అలరించిన సంగతి తెలిసిందే. ఫాంటసీ కామెడీగా ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రాన్ని ఆర్‌జే బాలాజీ ప్రధాన పాత్రలో నటిస్తూ..స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. 2020లో వచ్చిన ఈ సినిమాకి ఇప్పుడు సీక్వెల్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కొనసాగింపు చిత్రం కోసం చిత్రబృందం పూర్వనిర్మాణ పనుల్ని కూడా ప్రారంభించినట్లు సమాచారం. మరి నయనతార పోషించిన పాత్రను ఎవరు చేస్తారన్న ప్రశ్నకు సమాధానంగా..అగ్రతార త్రిష పేరు ప్రచారంలో ఉంది. 'మంచి కథాంశంతో, ఆలోచనాత్మక సందేశంతో రానున్న ఈ చిత్రంలో త్రిష పాత్ర మరింత అందంగా ఉంటుంది. ఈ సినిమాలో తను భాగం కావడం ఆనందంగా ఉంది' అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఈమె ఈ ప్రాజెక్టులో భాగం కానుందో లేదో తెలియాలంటే చిత్రబృందం అధికారికంగా తెలిపే వరకూ ఆగాల్సిందే. ప్రస్తుతం 'విశ్వంభర', 'థగ్‌లైఫ్', 'ఐడెంటిటీ', 'రామ్' లాంటి చిత్రాలతో బిజీగా గడుపుతోంది త్రిష.





# నవ్వించి.. కదిలించే రఘు తాత

చిత్రపరిశ్రమలో వరుస సినిమాలతో జోరు చూపిస్తోంది అందాల తార కీర్తి సురేశ్. ప్రస్తుతం తమిళ చిత్రాలతో బిజీగా గడుపుతున్న ఈమె త్వరలో 'రఘుతాత'తో నవ్వులు పండించేందుకు అభిమానుల ముందుకు రానుంది. కయల్విజి పాత్రలో కీర్తి నటిస్తున్న ఈ చిత్రాన్ని సుమన్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా విడుదల కోసం ఎదురుచూసే ప్రేక్షకులకు తీపి కబురు వినిపించింది కీర్తి. ఈ చిత్రం ఆగస్టు 15న థియేటర్లలోకి రానున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా తెలుపుతూ..పోస్టర్‌ని పంచుకుంది. "రఘుతాత' మీ మనసులను దోచుకోవడానికి సాహసోపేతమైన కథతో వస్తున్నాడు. హృదయాన్ని కదిలించే కయల్విజి చేసిన వినోదాత్మకమైన భావోద్వేగ ప్రయాణాన్ని చూసేందుకు సిద్ధంగా ఉండండి. నవ్విస్తూ.. కదిలించేలా చేసే కథ ఇది' అంటూ వ్యాఖ్యల్ని జోడించింది కీర్తి. ఆమె 'బేబీ జాన్'తో హిందీలోనూ అలరించనుంది.

# రివ్యూ: మిస్టర్ అండ్ మిసెస్ మహి

రాజ్‌కుమార్ రావ్, జాన్వీ కపూర్ జంటగా శరణ్ శర్మ తెరకెక్కించిన స్పోర్ట్స్ డ్రామా ఎలా ఉంది?

చిత్రం: మిస్టర్ అండ్ మిసెస్ మహి
నటీనటులు: రాజ్‌కుమార్ రావ్, జాన్వీ కపూర్, రాజేశ్ శర్మ, కుముంద్ మిశ్రా తదితరులు
సినిమాటోగ్రఫీ: అనయ్ గోస్వామి
ఎడిటింగ్: నితిన్ బైద్
రచన: నిఖిల్ మల్హోత్ర, శరణ్ శర్మ
నిర్మాత: కరణ్ జోహార్, జీ స్టూడియోస్
దర్శకత్వం: శరణ్ శర్మ




స్పోర్ట్స్ డ్రామాలకి పెట్టింది పేరు బాలీవుడ్. హాకీ మొదలుకుని కుస్తీ వరకూ పలు రకాల క్రీడల్ని స్పృశిస్తూ సినిమాలు రూపొందుతుంటాయి. ఈ మధ్యే అజయ్ దేవగణ్ 'మైదాన్' వచ్చింది. ఇప్పుడు క్రికెట్ నేపథ్యంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. రాజ్ కుమార్ రావ్, జాన్వీ కపూర్ జంటగా నటించడం.. అగ్ర నిర్మాత కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ నుంచి వస్తుండడంతో ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. మరి అందుకు తగ్గట్టుగా సినిమా ఉందా?

**కథేంటంటే:** మహేంద్ర (రాజ్ కుమార్ రావ్) ఓ ఫెయిల్యూర్ క్రికెటర్. మరో ఏడాది అవకాశమిస్తే తానేంటో నిరూపించుకుంటానని బతిమాలతాడు. అయినా తండ్రి వినిపించుకోకుండా తన స్పోర్ట్స్ షాప్ నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తాడు. మహిమ అగర్వాల్ (జాన్వీ కపూర్)తో పెళ్లి చూపులు ఏర్పాటు చేస్తారు. తన ఫెయిల్యూర్ స్టోరీ చెప్పినప్పటికీ మహేంద్ర మనసు నచ్చి పెళ్లి చేసుకోవడానికి అంగీకారం తెలుపుతుంది మహిమ. వైద్యురాలైన ఆమెకీ క్రికెట్ అంటే పిచ్చి. అలా ఆ ఇద్దరి క్రికెట్ ప్రేమ వాళ్లని ఎక్కడిదాకా తీసుకెళ్లింది? విజయవంతమైన క్రికెటర్ కావాలనుకున్న మహేంద్ర కలలు ఎలా నెరవేరాయనేది **మిగతా కథ.**

ఎలా ఉందంటే: క్రీడా నేపథ్యంలో సాగే కథలన్నీ ఇంచుమించు ఒకేలా ఉంటాయి. ఫెయిల్యూర్స్‌తో అప్పటివరకూ అండర్‌డాగ్‌లా కనిపించిన హీరో... చివరికొచ్చేసరికి విజేతగా నిలిచి తన కలని నెరవేర్చుకుంటాడు. ఆ మధ్యలో నడిచే డ్రామా ఎంత వైవిధ్యంగా, ఎంత ఆసక్తికరంగా ఉందన్నదే సినిమా ఫలితాన్ని నిర్దేశిస్తుంది. హీరో గెలుస్తాడని తెలుసు. ఎలా గెలుస్తాడనే విషయంలోనే ఉంటుంది అసలు సిసలు ఉత్కంఠ. 'జెర్సీ'ని గుర్తు చేసే హీరో క్యారెక్టరైజేషన్‌తో రూపొందిన ఈ సినిమా ఆరంభం, చివరలో కాదు... మధ్యలో డ్రామా కూడా ప్రేక్షకుడి ఊహకు తగ్గట్టుగా సాగడం మైనస్‌గా మారింది. హీరోకి కోచ్ కావాలనే కోరిక కలగడం, హీరోయిన్ బ్యాట్ పట్టడంతోనే ఈ కథ ప్రయాణమేమిటో ప్రేక్షకుడికి అర్థమైపోతుంది. మధ్యలో డ్రామా కోసమని మైదానం నుంచి బయటికొచ్చి, భార్యాభర్తల మధ్య ఐడెంటిటీ గొడవని సృష్టించినా అదేమంత రక్తికట్టదు. మహిమ ఇంకా పూర్తిస్థాయి క్రికెటర్ కాకముందే, హీరో మహేంద్ర తన గుర్తింపు కోసం పాకులాట మొదలుపెట్టే సన్నివేశాలు కథకి అతకలేదు. చెప్పాల్సిన కథేమీ లేక ఇలా మరో దారిని ఎంచుకున్నట్టు అనిపిస్తుంది. (%ఖజీ జుదీఖి ఖజీరీ ఖబీనీరి ఫ్ఘలిఖీరిలిగీ%) హీరో, హీరోయిన్ల నేపథ్యం, పెళ్లి ప్రయాణం వరకూ సినిమా ఆకట్టుకుంటుంది. ఆ తర్వాత కథ సాదాసీదాగా మారిపోయింది. ప్రతీ సన్నివేశం ప్రేక్షకుడికి ఊహకు తగ్గట్టుగా సాగుతుంటుంది. ద్వితీయార్థంలో అయితే హీరోకీ, ఆయన తల్లికీ మధ్య సాగే సన్నివేశాల్లో తప్ప ఎక్కడా మెరుపులు కనిపించవు. కథ, కథనాల కంటే జాన్వీకపూర్, రాజ్‌కుమార్ రావ్ జోడీ నటనే సినిమాని కొంతవరకు నిలబెట్టింది. సినిమాల్లో క్రికెట్ మ్యాచ్‌ని చూపిస్తున్నప్పుడు, ప్రేక్షకుడు నిజంగానే ఓ ఉత్కంఠ భరితమైన మ్యాచ్‌ని చూస్తున్న అనుభూతి కలిగేలా సన్నివేశాల్ని మలుస్తుంటారు దర్శకులు. కానీ, ఇందులో ఆ తరహా జాగ్రత్తలూ తీసుకోలేదు. హీరోయిన్ వెళ్లి వరుసగా సిక్సర్లు కొట్టి మ్యాచ్‌ని గెలిపించేస్తుంది. రచనలోనే చాలా లోపాలు కనిపిస్తాయి.

**150 రోజుల ట్రైనింగ్.. 30 రోజుల షూటింగ్.. రెండుసార్లు గాయాలు**

ఎవరెలా చేశారంటే: రాజ్‌కుమార్ రావ్, జాన్వీ కపూర్ జోడీ ఆకట్టుకుంటుంది. వాళ్లిద్దరూ పాత్రల్లో సహజంగా ఒదిగిపోయారు. కోచ్ బెన్నీగా కనిపించిన రాజేశ్ శర్మ, మహేంద్ర తండ్రిగా కుముద్ మిశ్రా, తల్లిగా జరీనా వహాబ్‌ల నటన గుర్తుండిపోతుంది. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. అనయ్ గోస్వామి కెమెరా పనితనం మెప్పిస్తుంది. పాటలు బాగున్నాయి. జాన్ స్టీవార్ట్ ఏడూరి నేపథ్య సంగీతం సినిమాపై ప్రభావం చూపించింది. నిఖిల్ మల్హోత్ర, దర్శకుడు శరణ్ శర్మ కలిసి స్క్రిప్ట్ రాశారు. రచన పరంగా మరింత వైవిధ్యం చూపించాల్సింది. ఎగ్జిక్యూషన్ పరంగానూ శరణ్ శర్మ ప్రభావం చూపించలేకపోయారు. నిర్మాణం సినిమా స్థాయి, పరిమితులకి తగ్గట్టే ఉంది.

# విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీస్టార్' ఆడకపోవడానికి కారణమిదే



విజయ్ దేవరకొండ, మృణాళ్ ఠాకూర్ జంటగా పరశురామ్ తెరకెక్కించిన 'ఫ్యామిలీస్టార్' పెద్దగా ఆడకపోవడానికి కొన్ని కారణాలు ఉన్నాయంటూ ప్రముఖ సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

'ఫ్యామిలీస్టార్' విజయ్ దేవరకొండ కథేనని, అయితే కథనంలో ఆయన బాడీ లాంగ్వేజ్‌ను దాటి ట్రీట్‌మెంట్ ఇవ్వడం వల్ల ఫలితం మారి ఉండవచ్చని ప్రముఖ సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ అభిప్రాయపడ్డారు. సినిమాలో అనేక అంశాలు ఉన్నా, ఎక్కడా బాగోలేదని అనడానికి లేదని, సెకండాఫ్‌లో ఒక పావు గంట తీసేసి ఉంటే, 'ఫ్యామిలీస్టార్' మరో రకంగా ఉండేదని తనకు అనిపించినట్లు చెప్పారు. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించిన ఈ మూవీని పరశురామ్ తెరకెక్కించారు. దిల్‌రాజు నిర్మించారు. 'పరుచూరి పలుకులు' పేరుతో వివిధ సినిమాలను విశ్లేషిస్తూ, దర్శకత్వం వైపు రావాలనుకునే వారికి పాఠాలు చెబుతున్న ఆయన 'ఫ్యామిలీస్టార్'ను విశ్లేషించారు.

"ఫ్యామిలీస్టార్' రొమాంటిక్ యాక్షన్ డ్రామా ఫిల్మ్ అన్నారు. యాక్షన్ డ్రామా అనే పదం కీలకం. ఈగో కలిగిన ఒక అమ్మాయి, అబ్బాయికి మధ్య ఒక తెలియని అనుబంధం ఏర్పడితే, అది ఎన్నిరకాల పరిణామాలను చవి చూస్తుందనేది ఈ చిత్ర కథ. కుటుంబం భారమంతా హీరోనే మోస్తాడు. అలాంటి వ్యక్తి ఇంటి పైన కథానాయిక అద్దెకు దిగుతుంది. వీరిద్దరి మధ్య తెలియని రొమాన్స్ డెవలప్ అవుతోందని ప్రేక్షకుడు ఆలోచనలో పడతాడు. వారిద్దరూ ఎక్కడో ఒక చోట కనెక్ట్ అవుతారని, ఈగో ఫ్యాక్టర్ కారణంగా, గొడవలవుతాయని మనల్ని ఊహించేలా దర్శకుడు చేశారు. సినిమాలో హీరోని పీనాసి వాడిలా చూపించారు. కానీ, అతను అతి జాగ్రత్తపరుడు. సినిమాను కథా భాగాలుగా విభజిస్తే, హీరోయిన్ వచ్చిన తర్వాత ఆమెకో కథ ఉంటుంది. హీరో.. హీరోయిన్‌తో గొడవపడి యూఎస్ వెళ్లడంతో ఒక కథ, హీరోయిన్ మిస్సయిన తర్వాత మరో కథ.. ఇలా చాలా కథలున్నాయి. కథా, కథా చాతుర్యంతో దర్శకుడు ఆడుకున్నాడు. కానీ, ఆశించిన స్థాయిలో కలెక్షన్లు రాలేదు. అందుకు కారణం.. హీరో బాడీ లాంగ్వేజ్‌కు ఉన్న యూత్, లవ్ ఫీల్‌ను మించి ఒక యాక్షన్ హీరో బాడీ లాంగ్వేజ్‌ని ఆపాదించారు. హీరో ఇమేజ్ కన్నా విభిన్నంగా అతడితో ఫైట్స్ చేయడం వల్ల మూవీ దెబ్బతిందని నా అభిప్రాయం. హీరోను ఇష్టపడుతున్న సంగతి హీరోయిన్ చెబుదామనుకున్న ప్రతిసారీ అతడు వినడు. ఒకవేళ ఆ అమ్మాయి మొండిగా 'ఐ లవ్ వ్యూ' అని ఉంటే కథ వేరేలా ఉండేది" "ఇక ఇల్లు వాస్తు గురించి చెబుతూ రవిబాబుతో ఫైట్ చేయడం ఆసక్తికరంగా ఉంది. విరామ సన్నివేశాల వరకూ ఒక ఫీల్‌గుడ్ మూవీలా ఆశ కల్పిస్తూ తీసుకెళ్లి, ఇద్దరూ బ్రేకప్‌తో ఇంటర్వెల్ వేశాడు. మళ్లీ ఎలా కలుస్తారన్న ఆసక్తిని కలిగించాడు. విచిత్రం ఏంటంటే, ఆ అమ్మాయి ఉన్న ఆఫీస్‌లోనే హీరో పని చేస్తాడు. సెకండాఫ్‌లో హీరో ఫ్యామిలీకి హీరోయిన్ సాయం చేస్తుండటంతో ఆమె గ్రాఫ్ పెరుగుతూ వచ్చింది. దీంతో హీరో తగ్గిపోయాడు. హీరోను హీరోయిన్ అపార్థం చేసుకుని, దూరమయ్యే ప్రేమ కథలు ఎక్కువగా హిట్ అవుతాయి. కానీ, హీరో తన ఈగోతో హీరోయిన్‌ను దూరం చేసుకుంటున్నాడన్నది ప్రేక్షకుడికి కనెక్ట్ కాలేదు. ఫస్టాఫ్‌లో బాగానే ఉన్నా, సెకండాఫ్‌లో సమస్యలు కూడా లేవు. కోమా స్టేజ్‌లో ఉన్న వ్యక్తితో పెళ్లి చేయాలన్న కాన్సెప్ట్ తీసుకురావడం, వేరే అతను ఈ అమ్మాయిని తీసుకెళ్లాడన్న పాయింట్‌ను లాక్ చేయడంతో సెకండాఫ్‌లో స్క్రీన్‌ప్లే గ్రిప్ తప్పింది" "జగపతిబాబు పాత్ర హీరోయిన్ గురించి చెప్పకపోతే ఇద్దరూ విడిపోతారేమో అనిపించేలా దర్శకుడు కథనాన్ని నడిపాడు. విజయ్ దేవరకొండ బాడీ లాంగ్వేజ్‌కు మించి చివరిలో 50-60మందిని కొట్టడం ఆడియెన్స్ ఆమోదిస్తున్నారేమో తెలియదు. పాత సినిమాలో జరిగిన వాటిని దాటి ఇలా తీస్తున్నారు. పైగా క్లైమాక్స్‌లో చిన్న మెలో డ్రామా సీక్వెన్స్ చూపించారు. ఈ కథ విజయ్ దేవరకొండదే. కథనంలో బాడీ లాంగ్వేజ్‌ను దాటిన ట్రీట్‌మెంట్ ఉంది. సినిమా అక్కడక్కడా మాత్రమే బాగోలేదు. సెకండాఫ్‌లో ఒక పావు గంట తీసేసి ఉంటే ఇంకో రకంగా ఉండేదా? అన్నది నా ఫీలింగ్. విజయ్ దేవరకొండ లవర్ బాయ్. ఆయనను దృష్టిలో పెట్టుకుని కథలు రాసేటప్పుడు ఆడిటోరియానికి సరిపోయేలా ట్రీట్ రాస్తే, ఆ సినిమాలు ఎక్కువ హిట్ అయ్యే అవకాశం ఉంటుంది" అని పరుచూరి గోపాలకృష్ణ చెప్పుకొచ్చారు.

# విజయ్ చిత్రంలో సత్యదేవ్?

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో హీరో సత్యదేవ్ కీలక పాత్రలో కనిపించనున్నారని సమాచారం. దీంట్లో ఆయనది పూర్తి నిడివి ఉన్న పాత్ర అని.. కథలో తన పాత్రకు ఎంతో ప్రాధాన్యముందని తెలిసింది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం వైజాగ్‌లో శరవేగంగా జరుగుతోంది. ఇందులో విజయ్‌కు జోడీగా భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com